# నీ కోసం

రచన:
శ్రీమతి పి. మాణిక్యం

బైట కోలాహలంకి వ్రాస్తున్న పుస్తకంలోంచి కిటికీగుండా దృష్టి సారించాడు హాస్టలు వార్డెన్ కృష్ణమూర్తి.

హాస్టలుముందు కారాగి వుంది. అందులోంచి దిగి ఠీవిగా నడచి వస్తోంది అగ్రశ్రేణి నటీమణి రమ్యమాల.

చప్పున లేచి ఎదురెళ్ళా డాయన.

"ఆగిపోయావేం రమా! లోపలికి రా!" అదరంగా ఆహ్వానించా డాయన.

"నేను మీకోసం రాలేదు, అయినా నా పేరు రమ కాదు; రమ్యమాల." సూటిగా అతని ముఖంలోకి చూస్తూ చెప్పిందామె.

"అది యిప్పటి పేరు కావచ్చు. నాకు తెలిసిన నీ గతంలో పేరు....!"

"అలాగా! నా గతాన్ని నేను మర్చిపోయినా మీరు మరువలేదన్న మాట. నా పేరు కూడా గుర్తున్నందుకు ధన్యవాదాలు. అయినా నేనిప్పుడు మీతో వాదనకు రాలేదు. మీ హాస్టలులో ఉన్న చైతన్యను ఒకసారి పిలిపిస్తారా?" అందామె.

ఆమె కంఠంలోని వ్యంగ్యాన్ని పట్టించుకునే స్థితిలో లేడాయన.

"చైతన్య కోసం వచ్చావా? అతను నీ కేమౌతాడు?" అనుమానం, ఆశ్చర్యం, అతని మాటల్లో స్పష్టమౌతుండగా కుతూహలంగా ఆమె ముఖంలోకి చూసాడు.

"అది మీకనవసరం. అయినా కుతూహల పడుతున్నారు గనుక చెప్తున్నాను. వాడు నా కన్న కొడుకు. వాడి కన్న తండ్రి వాడి బాధ్యతను విస్మరించి, పిరికివాడిలా పారిపోయినా, తల్లిగా అది పాపమైనా, శాపమైనా నా కడుపున మొయ్యక తప్పలేదు. కన్నందుకు నా బాధ్యత నెరవేరుస్తున్నాను."

"అంటే....అంటే....చైతన్య....?"

"చెప్పానుగా, నా బిడ్డని?" నిర్లక్ష్యంగా చూపింది.

"ఒక్క నిముషం!" అంటూ లోపల కెళ్ళాడాయన.

"చైతన్యా, నీకోసం ఎవరో వచ్చారు." అన్న వార్డెన్ మాటలకు - రవ్వంత ఆశ్చర్యం, తొట్రుపాటు కనిపించా యాతని ముఖంలో.

"నా కోసమా? ఈ యిరవై మూడేళ్ళలో యీ మాట ఎప్పుడూ వినలేదే! నాకు తెలిసినంతవరకూ 'నా' అన్న వాళ్ళెవరూ నాకు లేరే! నా ఖర్చులకు హాస్టలుకు నెల నెలా డబ్బు వస్తోంది. అది ఎక్కడిదని అంటే మీ అమ్మ పంపిస్తుందన్నారే తప్ప ఆమెను నే నెరుగను. నా భావనలో నా కెవరూ లేరు." ఆవేశంగా అన్నాడు చైతన్య.

"అవన్నీ తరువాత ఆలోచించవచ్చు. ముందు కెళ్ళి మాట్లాడి రా!...." బయటకు వచ్చేసాడు కృష్ణమూర్తి. వెనుకనే చైతన్య కూడా వచ్చాడు.

"బాబూ!" మాతృత్వపు ఆనందం పొంగి పొర్లగా, చప్పున లేచి ఎదురెళ్ళి ప్రేమగా చేతులు చాచిందామె.

అతను అలాగే శిలాప్రతిమలా నిల్చున్నాడే తప్ప అతనిలో ఏ మాత్రం చైతన్యం కలిగించలేక పోయిందామె పిలుపు.

"నేను....నేను నీ తల్లిని బాబూ! ఏమిటలా వింతగా చూస్తున్నావు? దా నాన్నా! ఒక్కసారి 'అమ్మా!' అని పిలవరా!" దగ్గరకొస్తూ అందామె.

"ఆగు....ఎవర్నువ్? నువ్వు నా కమ్మవా? ఏం జోక్ వేస్తున్నావా? నేను అనాధను. నా కెవరూ లేరు. ఎవరో దయదలచి పంపించే డబ్బుతో ఐ. ఎ. ఎస్. వరకూ చదివాను. తరువాత ఆ అప్పు తీర్చేస్తాను. ఇన్నాళ్లుగా యిన్నేళ్ళుగా లేని, రాని అమ్మ హఠాత్తుగా ఊడి పడి 'బాబూ, నీ తల్లినిరా!' అంటే కరిగి పరవశంతో నీ చేతుల్లో వాలడానికి ఇదేమైనా షూటింగనుకుని కల గంటున్నావా అగ్రశ్రేణి నటీమణి రమ్యమాలా? ప్లీజ్ - గెట్ అవుట్!" అరిచాడు చైతన్య.

అతని మనసు భగభగా మండి పోతుంది. ఇన్నాళ్ళు ఒంటరితనం అనుభవించిన వాడికే తెలుస్తుందా బాధ.

"ఇన్ని శ్రమలు పడి, కొండంత దుఃఖాన్ని మనసులో నింపుకొని, నిన్నింత వాడ్ని చేసింది. ఇంత చదివించింది యిందుకేనా? ఆవేశం విడిచి ఆలోచనా జ్ఞానంతో, నన్నర్థం చేసుకుంటావనుకున్నాను!...." బాధగా అంది రమ్యమాల.

"హుఁ....నన్నింత వాడ్ని చేసావా? నీ పాలిచ్చి పెంచావా? నీ ఒడిలో లాలించావా? నీ చేత్తో ఒక్క ముద్ద ప్రేమగా నా నోటికి అందించావా? ఈ నాడు నీ తల్లిని అని చెప్పేవరకూ నువ్వు నా తల్లివని తెలియదు. ఎవరిచేతో మోసపోయిన పాపాన నన్ను కన్నావు. కన్న వెంటనే ఈ హాస్టలులో పారేసావు. నీవు మాత్రం అగ్రశ్రేణి నటి

అప్పింటుకోవాలని రోజుకో మగాడి ప్రక్కన నటిస్తూ పేరుప్రఖ్యాతులను సంపాదించుకుంటున్నావు. నాకుద్యోగం వచ్చాక నువ్వు నన్ను కని పెంచేందుకు ఖర్చు పెట్టిన మొత్తం యిచ్చేస్తాను. ఇంకెప్పుడూ నా తల్లినని చెప్తూ నన్ను చూసేందుకు రాకు." కర్కశంగా చెప్పి అక్కడి నుండి కదలబోయాడు చైతన్య.

"ఆగరా...ఏమన్నావ్? నిన్ను కన్నందుకు డబ్బిస్తావా? నిన్ను నవ మాసాలు మోసి కన్నందుకు వెల కడతావా? కాబోయే కలెక్టరువి కదూ? అందుకే నీ తెలివి తేటలు, నీ వయసును మించి పోయాయిరా! కన్న తల్లివి, అన్నం పెట్టే వృత్తిని అవమాన పర్చకూడదన్న నిజం కూడా నీ చదువు నీకు నేర్పించనందుకు చింతిస్తున్నాను. నేను చెప్పేది పూర్తిగా విన్నతర్వాత ఒక్కసారి 'అమ్మా!' అని నువ్వు పిలవగలిగితే నా కంతే చాలు.' ఆమె కంఠంలోని బాధ సుడులు తిరిగింది. దాని నేమాత్రం అతను లక్ష్యపెట్టలేదు.

"అది యీ జన్మలో జరగదు. పిచ్చి పిచ్చిగా ఇక్కడికి వచ్చి నన్ను విసిగించకు. ఈ జన్మలో నీ ముఖం నాకు చూపించకు." చకచకా నడచుకుంటూ వెళ్ళిపోయాడు చైతన్య.

* * *

సాయంత్రం ఐదు గంటల సమయంలో గబగబా లోపలి కెళుతున్న చైతన్య వార్డెన్ పిలుపుతో ఆగి అతని ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసాడు.

టేబుల్ సొరుగులోంచి ఓ కవరు తీసి చైతన్య కందించా డాయన.

"ఇది....?" వార్డెన్ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసాడు చైతన్య.

"మీ అమ్మగారిచ్చి వెళ్ళారు. 'నీ కోసం' చాలా సేపు చూసి యీ ఉత్తరం వ్రాసి ఓ అరగంట క్రితం యిక్కడి నుండి వెళ్ళిపోయారు." చెప్పాడు. తన రూంలోకి వెళ్ళి కవరు చింపాడు చైతన్య.

చిరంజీవి చైతన్యకు మీ అమ్మ దీవించి వ్రాయునది. బాబూ! ఈ ఉత్తరమైనా పూర్తిగా చదువుతావు కదూ? ప్రస్తుత పరిస్థితుల్లో నువ్వు బాగా ఆవేశంగా ఉన్నావు. నేనేం చెప్పినా వినే స్థితిలో లేవు. అందుకే యిది వ్రాస్తున్నాను. నన్ను అర్థం చేసుకుంటావని ఆశిస్తున్నాను కూడా. నా కథంతా చదివాక అప్పుడైనా నువ్వు నన్ను 'అమ్మా!' అని పిలవగలిగితే అదృష్టవంతురాలిని.

* * *

నేను చదువునే రోజుల్లో—అంద రాడపిల్లలవలె నేను కూడా ఒక వ్యక్తికి మనసిచ్చి, మనసారా నమ్మి, నన్ను నేను అతని కర్పించుకున్నాను. నేను గర్భవతి నని తెలుసుకొని గుట్టు చప్పుడు కాకుండా అబోర్షన్ చెయ్యించుకోమని ఓ ఉచిత సలహా పారేసి చల్లగా జారుకున్నాడు. మా వాళ్ళు అయినా నన్ను ఆదరిస్తా రనుకున్నాను. విషయం తెలుసుకున్నవాళ్ళు నన్ను నిర్దాక్షిణ్యంగా ఇంటి నుంచి గెంటివేశారు. చచ్చిపోదా మనుకున్నాను, నా కడుపులో వున్న నువ్వు నా కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నట్లు ఒక్కసారి కదిలావు, అందరిలా నేను చావకూడ దనుకున్నాను. పిరికి దానిలా నా బిడ్డను చంపుకో దలచుకోలేదు. తండ్రి తన బాధ్యతను మరచిపోయినా, నిన్ను పెంచాలనుకున్నాను. వెంటనే ఓ ప్రైవేటు కంపెనీలో చేరి ఉద్యోగం చేస్తూ వచ్చాను.

ఒకసారి నీకు విషజ్వరం వచ్చింది, నిన్నొదిలి ఆఫీసుకు వెళ్ళాలంటే, భయంవేసి నీ దగ్గరే ఉండి పోయాను. అది ప్రైవేటు కంపెనీ గనుక, ఎక్కువ రోజులు పని చెయ్యనందువలన నన్ను తీసేసారు. దిగులుగా వస్తున్న నా వెనుక ఒక వ్యక్తి త్వరత్వరగా వస్తుంటే నాకు భయం

TRADE MARK Geneva TIRUPUR 638...

Regd. No. A. 29259/80

మీ సంతృప్తికి ....

మేము తయారిస్తున్న ప్రత్యేకమైన రకాలు !!

* మ్యాజిక్ ఫైన్ * జెనీవా ఫైన్
* పాయల్ ఫైన్ * కూల్ టెక్స్ ఫైన్
* ఖోలె ఫైన్ * పైలెట్ ఫైన్

: తయారించువారు :

Phone : 22891

GENEVA KNITTERS, Stans Road 1st Street, TIRUPUR - 638 602.

వేపే తొందరగా ఇల్లు చేరుకున్నాను. అతను కూడా నా వెనకే వచ్చాడు.

"అమ్మా! ఎందు కంత భయపడుతున్నావ్? నీలాంటి అందమైన అమ్మాయికోసమే చూస్తున్నాం! ఒక్క సిని మాలో నటిస్తే చాలు. నీ కెంత డబ్బు కావాలన్నా ఇస్తాం!" అన్నాడు, నాకు ఒళ్ళు మండింది.

"ఏమయ్యా! నీ కంటికి సంసారిలా కన్పిస్తున్నానా, లేక.........?"

"అమ్మమ్మ....అంత మాటనకమ్మా! సినిమాలో వేషా వేసే వాళ్ళమీద అంత తేలిక భావం మంచిది కాదమ్మా! ఆలోచించండి. మీ మనసు మారితే ఇదిగో ఈ అడ్రసుకు రండి! మరో ఐదు రోజు లుంటాను ఊర్లో. ఈ లోగా మీ రాక కోసం చూస్తాం!" అంటూ వెళ్ళిపోయాడు. అత నిచ్చిన అడ్రసు కాగితం ఉండగా చుట్టి కసిగా అవతలకు విసిరాను. కిటికీ ఊచలకు తగిలి అది లోపలి కొచ్చి పడింది. మరుసటి రోజు—

నీకు మరీ తీవ్రంగా వచ్చింది జ్వరం. డాక్టరుగారి దగ్గరకు తీసుకువెళ్ళాను. ఆయన మందులు వ్రాసి యిస్తూ— "సాయంత్రం లోగా ఇవి వాడకపోతే, తరువాత విచారించి లాభం లేదు!" అన్నాడు.

ఆ సమయంలో నాకేం తోచలేదు! చేతిలో చిల్లిగవ్వ లేదు. భోరున ఏడుస్తూ కూర్చున్నాను. ఏదైనా ఉపాయం చూపమని నా బాబు కే అపాయం కలుగకుండా చూడమని శతకోటి దేవతలకూ మొక్కాను. వాళ్ళు నా ప్రార్థన విన్నారో లేదో తెలియదు! కాని—


ఆ అడ్రసున్న కాగితం మాత్రం గాలికి కదులుతోంది కిటికీమీద. చటుక్కున లేచి అది అందుకున్నాను. అందులో అక్షరాలు మసగ్గా కన్పిస్తున్నా, అంతా అర్థమయ్యింది. పరుగున వెళ్ళాను.

"రామ్మా! రా - నీ కోసమే చూస్తున్నా" నన్నాడాయన.

"నాకు అర్జంటుగా డబ్బు కావాలి!" అన్నాను. నా ఆతృతను గమనించి కొన్ని నోట్లు కట్లను నా ముందుకు జరిపాడు, అందులో ఒకటి తీసుకొని మందుల షాపుకు పరుగెత్తాను. ఆ క్షణంలో—

నే నేమౌతున్నానో నాకు తెలియదు! నా బాబును బ్రతికించుకోడమే నా ధ్యేయం!

నిన్ను నా దగ్గరే ఉంచుకొని చదివించా లనుకున్నాను. వయసుతోపాటు మనసూ పెరుగుతుంది. "అమ్మా! నాన్నేదీ?" అనే ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేక నీ చిన్నారి మనసును నొప్పించలేక నిన్ను దూరంగా పెంచాను. ఉండికూడా లేదనుకొనే దానికంటే ఎవరూ లేరనుకొనేదే బాగుంటుంది. ఏనాడూ నా ప్రేమానురాగాలు నీకు దూరం కాలేదు.



"అరుణ కిరణం"
చిత్రంలో
విజయశాంతి-శరత్ బాబు

నీ తండ్రి ఎవరా - అని నువ్వు శ్రమపడి ఆలోచించ నవసరం లేదు. మీ వార్డెన్‌గారే నిన్ను కన్న తండ్రి, నన్ను ఆనాడు దగాచేసిన మోసగాడు!

ఇప్పుడు చెప్పు! ఆ స్థితిలో ఉన్న నన్ను పట్టించుకోకుండా వేరే పెళ్ళి చేసుకొని హాయిగా పెళ్ళాం పిల్లలతో గడుపుతున్న వ్యక్తి గురించి—

చెడిన బంగారం కంసాలికే చెందా లంటారు! కాని, కన్నబిడ్డనన్న కనికరం లేక తరిమేసిన కన్నవారిని గురించి—

ఇంత బాధను మనసులో దాచుకుని కృత్రిమ నవ్వుల్తో జీవితమే నటనయిన నేను జీవిస్తున్న జీవితం గొప్పదా? ఆ సమయంలో ఏ ఆడదైనా అంతకంటే యేం చెయ్యగలదు?

ఒక్కసారి ఆలోచించి నీ మనసులో నాపై పేరుకుపోయిన చెడు భావాన్ని చెరిపేయ గలిగితే నాకంతే చాలు! నీకు నా ముఖం చూపకూడదనే నిర్ణయంతో వీలయినంత దూరం వెళ్ళిపోదా మనుకుంటున్నాను!

ఇట్లు,
దీవెనలతో-
'అమ్మా' అనే పిలుపుకు నోచుకోని అభాగ్యురాలు!
"రమ."

"అమ్మా!" అర్చాడు, ఒక్కదుటాన లేస్తూ ద్వారం దగ్గర నిల్చుని అంతా విన్న కృష్ణమూర్తి సిగ్గుతో ముఖం దించుకున్నాడు.

"చైతన్యా! మీ అమ్మకు తీరని ద్రోహం చేసాను. ఆమెకు క్షమాపణ చెప్పుకుందాం-రా!" బైటకు నడుస్తూ అన్నాడు వార్డెన్ నరుగున. రోడ్డెక్కా రిద్దరూ. అటుగా పోతున్న టాక్సీ నాపి పొమ్మన్నారు. గట్టిగా కళ్ళు మూసుకొని - అమ్మను ఎలా క్షమాపణ అడగాలో ఆలోచిస్తున్నాడు చైతన్య.

కారు సడన్ బ్రేకుతో ఆగడంతో — ముందుకు పడబోయి నిలద్రొక్కుకొని - "కారెందు కాపావ్?" విసుగ్గా డ్రైవరువైపు చూసాడు చైతన్య.

"రోడ్డు గడ్డంగా ఈ జనం దారివ్వడం లేదు సార్! ఏదో ఏక్సిడెంటులా వుంది!" అంటూ క్రిందికి దిగాడు డ్రైవరు.

ఏమిటో చూద్దామని చైతన్య కూడా దిగి ఎదురు దృశ్యాన్ని చూసి బొమ్మలా వుండి పోయాడు, అక్కడో కారు చెట్టుకు గుద్దుకొని ఉంది. కారులోంచి ఓ స్త్రీ శవం డోర్‌కు అడ్డంగా పడి వుంది.

ఒక్క వుదుటున చేరా డామెను చైతన్య.

"అమ్మా!...." అంటూ అరిచాడు దిక్కులు పిక్కటిల్లేలా.

"ఏం జరిగింది?...." అంటూ టాక్సీ దిగి వచ్చాడు కృష్ణమూర్తి.

"అమ్మా! ఒక్కసారి కళ్ళు తెరచి నన్ను చూడమ్మా! నీ చైతన్యనమ్మా! నీకు దూరంగా ఇంక వుండనని చెప్పావు, నిజం తెలియక నిన్ను అనరాని మాటలన్నందుకు నీ చేత శిక్షింపబడాలని వచ్చానమ్మా!" అంటూ పసిపిల్లాడిలా ఏడ్చి ఏడ్చి అలాగే ఆమె మీద ఒరిగిపోయిన చైతన్యను హాస్పత్రికి తీసుకెళ్ళారు.

అగ్రశ్రేణి నటీమణి రమ్యమాల శవాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు పోలీసులు.

ఎల్లప్పుడూ - మాచే తయారు చేయబడిన
♦ పాప్లిన్ ♦ విజయ్ ♦ సిల్వర్
♦ అనిన్ ♦ బాబి ♦ రోలెక్స్
బనియన్లనే వాడండి. అవి బనియన్లకెల్లా అత్యుత్తమమైనవి.
Phone: 25542
MEXICO KNITTING MILLS
5-F, Stans Road 3rd Street, TIRUPUR-638 602.